క్లుప్తంగా

కూలీలకు సౌకర్యాలు కల్పించండి

ధర్మవరం రూరల్: వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో ఉపాధి హామీ పథకం కింద పనులకు వెళ్తున్న కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఏపీఓ అనిల్‌కుమార్ రెడ్డి ఉపాధి సిబ్బందికి సూచించారు. గురువారం చిగిచెర్ల వద్ద జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. పనులు జరిగే ప్రదేశాల్లో నీడ కోసం టెంటు, అలాగే తాగునీటి సౌకర్యం, ప్రథమ చికిత్స కిట్లు తదితర వాటిని అందుబాటులో ఉంచాలన్నారు. అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించడం జరుగుతుందన్నారు. అనంతరం కూలీల మస్టర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ మాధమయ్య తదితరులు పాల్గొన్నారు.

అకౌంట్ పుస్తకాలు అందజేత

కదిరి అర్బన్: మున్సిపల్ పరిధిలోని వీవర్స్‌కాలనీలో ఉన్న మున్సిపల్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు జీరో అకౌంట్ పుస్తకాలను హెచ్ఎం నాగరాజు అందజేశారు. గతంలో విద్యార్థులే వెళ్లి బ్యాంకు చుట్టూ తిరిగి ఖాతాలు ప్రారంభించుకునే పరిస్థితి ఉండేదన్నారు. అయితే ప్రస్తుతం స్టేట్‌బ్యాంక్ ప్రతినిధులే పాఠశాలకు వచ్చి విద్యార్థులకు జీరో అకౌంట్ ఓపెన్ చేసి ఖాతా పుస్తకాలు అందజేశారన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

తనకల్లు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వైవీ కౌసల్య అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పూల నరసింహులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి అధికారులు, స్థానిక సంస్థల ప్రతినిధులు హాజరు కావాలని పేర్కొన్నారు.

కనగానపల్లిలో..

కనగానపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీఓ లక్ష్మీనారాయణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కుంపట్టి భాగ్యమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులతో పాటు, సర్పంచ్‌లు హాజరవుతారన్నారు. మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరై శాఖల వారిగా ప్రగతి నివేదికలను తెలియజేస్తారన్నారు.

జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపిక



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినితో ఉపాధ్యాయులు

రామగిరి: పేరూరుడ్యాంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని పల్లవి త్వరలో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం ప్రసన్నలక్ష్మి గురువారం తెలిపారు. పేరూరు పాఠశాల నుంచి ఈనెల 11 నుంచి 13 వరకు కృష్ణాజిల్లా విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్ 17 ఎస్‌జీఎఫ్ బాస్కెట్‌బాల్ పోటీల్లో జిల్లా తరఫున పల్లవి, కావ్య, హరిణి పాల్గొన్నారన్నారు. ఈపోటీల్లో పల్లవి రాణించడంతో త్వరలో ఢిల్లీలో జరగనున్న పోటీలకు ఎంపిక అయ్యిందన్నారు.

రవీంద్రారెడ్డిని గెలిపించాలి



ప్రచారం చేస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓట్లు వేసి, గెలిపించాలని ఎమ్మెల్సీ అభ్యర్థి సోదరుడు వెన్నపూస హరినాథ్‌రెడ్డి కోరారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు కళాశాలలు, సచివాలయాల సిబ్బందిని కలిశారు. వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ఓటర్లను కోరారు.

ఘనంగా గ్రామోత్సవం



రథంపై కొలువుదీరిన పార్వతీ పరమేశ్వరులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కాశీ విశాలాక్షి సహిత కాశీ విశ్వనాథస్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడు ద్వారకనాథ్‌శర్మ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం గ్రామోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పార్వతీ పరమేశ్వరుల ఉత్సవమూర్తులను బంగారు రథంపై కొలువుదీర్చి, పూజలు చేశారు. భక్తులు పార్వతీ, పరమేశ్వరులను భక్తులు దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు.

మహాశివరాత్రికి ముస్తాబు

బత్తలపల్లి: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని వివిధ దేవాలయాలు, శివాలయాలను ముస్తాబు చేస్తున్నారు. సంఘమేశ్వర క్షేత్రం, సంజీవపురం సమీపంలోని కాటికోటేశ్వర క్షేత్రంలో భక్తులు ఇబ్బందులు ఇబ్బందులు పడకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బత్తలపల్లిలో నూతనంగా నిర్మించిన శివాలయం, పోట్లమర్రి, ముష్టూరు శివాలయం, గంటాపురం అప్పస్వామి దేవాలయంలో ఉత్సవ విగ్రహాలను ఊరేగించేందుకు సర్వం సిద్ధం చేశారు. మాల్యవంతంలో వీరనారాయణస్వామి ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు అర్చకులు తెలిపారు. ఈనెల 19వ తేదీన ఆయా గ్రామాల్లో జాతర నిర్వహించి భక్తులకు భవిష్యవాణిని వినిపించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.





బత్తలపల్లి అలంకరణలో ఓంకారేశ్వరుడు, పోట్లమర్రిలో మల్లేశ్వరుడు



తిమ్మమ్మమర్రిమానులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ భవ్యకిషోర్

అన్నదాన కార్యక్రమాలు

శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సంఘమేశ్వర క్షేత్రంలో అప్రాచెరువు గ్రామానికి చెందిన గ్రామ పెద్దల ఆధ్వర్యంలో, కాటికోటేశ్వర క్షేత్రంలో పోటు కుమారులు, పోట్లమర్రి, గంటాపురం, రామాపురం, మాల్యవంతం, ముష్టూరు గ్రామాలలో భక్తులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం జరగనుంది. అలాగే సంఘమేశ్వర క్షేత్రం, బత్తలపల్లి శివాలయం వద్ద నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. పండుగను పురస్కరించుకొని ఆయా గ్రామాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి నిఘా పెట్టినట్లు సీఐ మన్సూరుద్దీన్, ఎస్ఐ టీవీ శ్రీహర్ష తెలిపారు.

కనగానపల్లిలో రేపటి నుంచి..

కనగానపల్లి: మండలంలోని పలు శివాలయాల్లో శనివారం నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతున్నాయి. కనగానపల్లి సమీపంలోని అతకల్లపట్నం మల్లేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించే శివరాత్రి ఉత్సవాలకు భక్తులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో తొలిరోజు ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలతో పాటు శివపార్వతుల కల్యాణోత్సవాన్ని వైభవంగా చేస్తారు. రెండో రోజు స్వామి రథోత్సవం, పవాడం, గొరవయ్యల పాలు పట్టే కార్యక్రమాలు జరుగుతాయి. తర్వాతా మాలగొండ్ల వంశస్తులతో ఆడబిడ్డలకు వడిబియ్యం పెట్టడం, అరికి బండారు కట్టడం, అన్నదానం చేస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నేటి నుంచి తిమ్మమ్మమర్రిమానులో..

ఎన్పీకుంట: మండల పరిధిలోని గూటిబైలు గ్రామం తిమ్మమ్మమర్రిమానులో వెలసిన తిమ్మమాంబ ఆలయంలో మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని ఈనెల 17వ తేదీ నుంచి మూడు రోజుల పాటు తిమ్మమాంబ మహాశివరాత్రి జాగరణ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 17వ తేదీ రాత్రి 8 గంటలకు రథోత్సవం, చెక్కభజన, 18వ తేదీన జాగరణలో భాగంగా ఏపీ టూరిజం గైడ్ ఎద్దుల మనోహర్ ఆధ్వర్యంలో తిమ్మమాంబ, బాలవీరయ్యల సంపూర్ణ జీవిత చరిత్ర బుర్రకథ కార్యక్రమం, 19వ తేదీన అమ్మవారికి ప్రత్యేక పూజలు, మొక్కుబడులు, బుర్రకథ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

రథోత్సవంలో పాల్గొననున్న ఎమ్మెల్యే

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా తిమ్మమ్మమర్రిమానులో శుక్రవారం రాత్రి నిర్వహించే తిమ్మమాంబ అమ్మవారి రథోత్సవంలో ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పాల్గొంటారని ఎంపీపీ రాము తెలిపారు. అమ్మవారి రథాన్ని లాగి ఉత్సవాలను ప్రారంభిస్తారన్నారు.

జాగరణ ఏర్పాట్ల పరిశీలన..

ఎన్పీకుంట: మండల పరిధిలోని గూటిబైలు గ్రామం తిమ్మమ్మమర్రిమానును గురువారం కదిరి డీఎస్పీ భవ్యకిషోర్, కదిరి రూరల్ సీఐ శంకర్‌నాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా శుక్రవారం నుంచి తిమ్మమ్మమర్రిమానులో నిర్వహించే శివరాత్రి జాగరణ మహోత్సవాల నిర్వహణపై ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులతో చర్చించారు. ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలను నిర్వహించాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాల్సిన బాధ్యత కమిటీ సభ్యులదేనని పేర్కొన్నారు. వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. నమోదైన కేసుల గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో ఎస్ఐ సద్గురుడు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ధర్మవరం: పట్టణంలో ఈనెల 18వ తేదీన మహాశివరాత్రి సందర్భంగా కేశవనగర్‌లోని శివాలయం నుంచి రథోత్సవం కార్యక్రమం ఉన్నందున ఉదయం 6:30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ డీఈఈ నాగేంద్ర, ఏఈ నాగభూషణం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా కేశవనగర్, శివానగర్, గీతానగర్, గుడ్డిబావి వీధి, చిన్నూరు, సంజయ్‌నగర్, నేసేపేటలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

ఈ-కేవైసీ చేయించుకోండి

అమడగూరు: రబీలో పంటలను సాగు చేసి, ఈ–క్రాప్ బుకింగ్ చేయించుకున్న రైతులందరూ ఈ–కేవైసీ చేయించుకోవాలని వ్యవసాయాధికారి జ్యోత్స్న పేర్కొన్నారు. గురువారం కసముద్రం, మహమ్మదాబాద్ రైతు భరోసా కేంద్రాలను తనిఖీ చేశారు. అలాగే ఈ ఏడాది రబీలో వ్యవసాయ సిబ్బంది చేసిన ఈ–క్రాప్ బుకింగ్, పంటల వివరాలను పరిశీలించారు. ఈ–కేవైసీ చేయించుకుంటేనే ప్రభుత్వం నుంచి సబ్సిడీలు అందుతాయన్నారు. అన్ని రకాల పంటలను ఈ–క్రాప్ బుకింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు.

పరామర్శ



వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ కృష్ణమూర్తిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

ధర్మవరం: పట్టణంలోని 19వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ కేశగాళ్ల కృష్ణమూర్తి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి గురువారం కృష్ణమూర్తిని పరామర్శించారు. రోడ్డు ప్రమాదం ఎలా జరిగిందని ఆరా తీశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లింగం నిర్మల పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని ఉప్పునేసినపల్లి గ్రామానికి చెందిన పెద్ద వన్నూరప్ప కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి గురువారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్య చికిత్సల కోసం రూ.50 వేల ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, గట్టం శ్రీనివాసరెడ్డి, నాగానందరెడ్డి, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

గొడవలకు స్వస్తి పలకండి

అమడగూరు: సమాజంలో కక్ష ప్రేరేపిత గొడవలకు శాశ్వితంగా స్వస్తి పలకాలని ఎస్ఐ వెంకటనారాయణ పేర్కొన్నారు. గురువారం ఆయన జౌకలకొత్తపల్లిలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీ పరిధిలో పలు కేసులు నడుస్తున్నాయన్నారు. ఆ కేసులకు సంబంధించి ఇరువర్గాల వారు రాజీ చేసుకుని లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలన్నారు. మారుతున్న కాలానుగుణంగా గొడవలకు ముగింపు పలకాలన్నారు. అలాగే ఇంటి చుట్టుపక్కల, పొలం చుట్టుపక్కల వారితో స్నేహపూర్వకంగా మసలుకోవడం ద్వారా ఎలాంటి గొడవలు జరగవని తెలిపారు. సకాలంలో పనులు చేసుకుంటూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటే జీవనం సాఫీగా జరిగిపోతుందన్నారు. కార్యక్రమంలో జమేదారు సుధాకర్ పాల్గొన్నారు.

శివాలయ పునఃప్రారంభోత్సవం





పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి , సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసరెడ్డి

కదిరి అర్బన్: మండల పరిధిలోని పట్నం గ్రామంలో గురువారం శివాలయ పునఃప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ ప్రకాష్, సర్పంచ్ చలపతినాయక్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణికంఠ నాయక్, సచివాలయాల కన్వీనర్ మధుసూధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పట్నం గంగిరెడ్డి, ఎస్టీ సెల్ నాయకులు కృష్ణానాయక్ పాల్గొన్నారు. అలాగే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసరెడ్డి పూజల్లో పాల్గొన్నారు. పట్నం శివాలయానికి రూ.50 వేలు ఆర్థికసాయాన్ని ప్రకటించారు. ఆయన వెంట పట్నం సర్పంచ్ చలపతినాయక్, నాయకులు వంశీధర్‌రెడ్డి ఉన్నారు. మండల పరిధిలోని యర్రదొడ్డి గంగమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి, ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి దర్శించుకున్నారు.

ఆర్థికసాయం అందజేత

కదిరి అర్బన్: మండల పరిధిలోని మీటేనాయక్ తండాకు చెందిన లీలాబాయికి ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి, సర్పంచ్ తోట లక్ష్మి గురువారం రూ.20 వేల ఆర్థికసాయాన్ని ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి సమక్షంలో అందజేశారు. ఇటీవల నీలాబాయికు చెందిన గేదె అనారోగ్యంతో మృతి చెందడంతో ఆర్థికసాయం అందజేశామన్నారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ నాయకులు కృష్ణానాయక్, గాండ్లపెంట మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

రామగిరి: మండల కేంద్రంలో ప్రముఖ స్వచ్ఛంద సంస్థ టింబక్టు కలెక్టివ్ చిగురు ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సైన్స్ దినోత్సవంలో విద్యార్థుల ప్రతిభ ఆకట్టుకుంది. ఈక్రమంలో పర్యావరణం, కాలుష్యం, సోలార్, ఏటీఎం, మొక్కలు, అగ్నిపర్వతాలు పలురకాల ప్ర దర్శనలు విద్యార్థులు రూపొందించారు. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సీఈఓలు కాంచన, తిరుమల, ఇషిత, రమ్య, కల్పన, అలివేళమ్మ, పోతు లయ్య, మంజుళ, ఆమని, రాధ, నితిన్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



రామగిరిలో ప్రదర్శించిన నమూనాలు

ఆర్డీటీ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు

నల్లమాడ: స్థానిక ఆర్డీటీ ఏరియా కార్యాలయంలో గురువారం నల్లమాడ ఏరియా పరిధిలోని 4, 5 తరగతుల విద్యార్థులకు ఏరియా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. నల్లమాడ, ఓడీ చెరువు మండలాలకు చెందిన 24 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఓడీ చెరువు మండలంలోని గౌనిపల్లి క్లస్టర్ విద్యార్థులకు మొదటి బహుమతి అందజేశారు. ద్వితీయ బహుమతిని నల్లమాడ క్లస్టర్ విద్యార్థులు సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ఎంఈఓ వేమనారాయణ చేతుల మీదుగా విజేతలకు స్టీల్ తట్టలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏటీఎల్ సుదర్శన్‌రెడ్డి, టీటీఎంలు వెంకటేష్, వెంకటనాయుడు, సీఓలు, సీబీటీలు పాల్గొన్నారు.



విజేతలతో ఆర్డీటీ సిబ్బంది

నాణ్యమైన విద్య అందించాలి

ఎన్పీకుంట: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈఓ గోపాల్‌నాయక్ ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం మండలంలోని ధనియానిచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించారు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

చెన్నేకొత్తపల్లి: అధైర్యపడొద్దు..అండగా ఉంటామని రాప్తాడు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. మండలంలోని మేడాపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చిగిచెర్ల వెంకటయ్య గురువారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి మేడాపురానికి వెళ్లి వెంకటయ్య మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యంగా ఉండాలని, పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గోవిందరెడ్డి, ఎంపీటీసీ నాగేశ్వర్‌రెడ్డి, నాయకులు జోగన్నగారి సూరి, లక్ష్మీరెడ్డి, మల్లికార్జున, జాలప్ప, మానేరు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల తనిఖీ



రికార్డులను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ యుగేశ్వరిదేవి

బత్తలపల్లి: మండల కేంద్రంలోని అనంతపురం రోడ్డులో ఉన్న పెట్రోల్ బంకులను గురువారం తహసీల్దార్ యుగేశ్వరిదేవి, సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ శారద, వీఆర్ఓలు గోవిందరాజులు, కుళ్లాయప్ప తనిఖీ చేశారు.
రాఘవంపల్లి క్రాస్ వద్ద ఉన్న అర్జున్ పెట్రోల్ బంకు, బీపీసీఎల్‌లను తనిఖీ చేసి పెట్రోల్, డీజిల్ కొలతలు, క్వాలిటీ, స్టాక్స్, స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. వసతులపై ఆరా తీసి, తనిఖీ నివేదికలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. స్టాక్స్, క్వాలిటీ, కొలతల్లో ఎటువంటి అవకతవకలు రాకుండా చూసుకోవాలని సూచించారు. లేనిపక్షంలో తగిన చర్యలు తీసుకుంటామని బంకు యజమాన్యం, సిబ్బందిని హెచ్చరించారు.

నూతన రథానికి పూజలు

ధర్మవరం అర్బన్: స్థానిక శివానగర్‌లోని బచ్చునాగంపల్లి కాశీ విశ్వనాథస్వామి ఆలయానికి నూతనంగా తయారు చేయించిన 30 అడుగుల రథానికి గురువారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, సతీమణి సుప్రియ దంపతులు ప్రాణ ప్రతిష్ఠ పూజలు చేశారు. అనంతరం పూర్ణకలశాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేపట్టారు. అర్చకుల వేదమంత్రోచ్చరణల నడుమ హోమం నిర్వహించారు. ఈనెల 18వ తేదీన మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శివాలయంలో నూతన రథంలో పరమేశ్వరుడిని కొలువుదీర్చి రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, పట్టణ ప్రముఖులను ఎమ్మెల్యే దంపతులు సన్మానించారు. పూజల్లో ఆలయ కమిటీ సభ్యులు, మున్సిపల్ చైర్‌పర్సన్ లింగం నిర్మల, వైస్ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



ఆలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

జాతీయస్థాయి జూడో పోటీలకు ఎంపిక

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని చిగిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కె.యశ్విత, కె. మహిత జాతీయ స్థాయి జూడో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయసాయి, వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రతాప్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి జూడో సబ్ జూనియర్–28 కేజీల విభాగంలో కె.యశ్విత అలాగే కెడెట్–52 కేజీల విభాగంలో కె.మహిత స్వర్ణ పథకం సాధించారన్నారు. శుక్రవారం నుంచి ఈనెల 22వ తేదీ వరకూ చెన్నైలో జరగబోయే జాతీయ స్థాయి జూడో పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారన్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.



పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

కత్తెర పురుగు నివారణపై అవగాహన

ఓడీ చెరువు: మొక్కజొన్న పంటలో కత్తెరపురుగు నివారణపై గురువారం మండల వ్యవసాయాధికారి ఇలియాజ్ రైతులకు అవగాహన కల్పించారు. గురువారం మండలంలోని కుసుమవారిపల్లి వద్ద రైతులు సాగు చేసిన మొక్కజొన్నను పరిశీలించారు. మొక్కజొన్న పంటకు కత్తెర పరుగు ఆశించిననట్లు గుర్తించారు. కత్తెర పురుగు నివారణ చర్యలను వివరించారు. పురుగు నివారణకు రైతులే స్వయంగా మందు తయారు చేసుకునే విధానాన్ని తెలియజేశారు. రెండు కిలోల బెల్లాన్ని మూడు లీటర్ల నీటిలో కలిపిన తర్వాత మరో 10 కిలోల తవుడు కలిపి ఒకరోజంతా నానపెట్టాలన్నారు. అనంతరం 100 గ్రాముల లార్విన్ అందులో కలిపి చిన్న చిన్న ఉంటలుగా తయారు చేసుకుని, మొక్కజొన్న కంకుల సుడిలో పడేలా చల్లాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ పవన్‌కుమార్, రైతులు ఈశ్వరయ్య, రామాంజి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

బాలిక మిస్సింగ్‌పై కేసు

ముదిగుబ్బ: మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలిక రెండు రోజులుగా కనిపించడం లేదని బాలిక తల్లిదండ్రులు పట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ శరత్ చంద్ర కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామ కంఠాలను గుర్తించండి

అమడగూరు: మండలంలో అన్ని గ్రామాల్లో గ్రామ కంఠాలను గుర్తించాలని డీఎల్‌పీఓ బాలాజీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మహమ్మదాబాద్ గ్రామ సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, సర్వేయర్లు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. డీఎల్‌పీఓ మాట్లాడుతూ.. పీఓఎల్ఆర్ కింద చేపట్టిన భూముల రీసర్వేలో భాగంగా గ్రామ కంఠాలను గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే గ్రామ కంఠాలకు చెందిన భూమిని పాస్‌పుస్తకాల్లో నమోదు కాకుండా చూడాలన్నారు. గ్రామ కంఠం భూముల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నసీమా, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ట



ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న దృశ్యం

పుట్టపర్తి టౌన్: కోవెలగుట్టపల్లిగ్రామంలో గుట్టపై నూతనంగా నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఉదయం భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఈ ఆలయానికి నంద్యాల నుంచి విగ్రహాలు, ధ్వజస్తంభం తీసుకొచ్చారు. పురోహితుడు నాగరాజ శర్మ ఆధ్వర్యంలో జ్యోతిప్రజ్వలన, మహాగణపతి పూజ, కలశపూజ, ధ్వజస్తంభం పూజలు చేపట్టారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు.